

## నేడు ఇస్రో 'సెంచరీ' ప్రయోగం

**ప్రజాశక్తి -సూళ్లూరుపేట**

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో తన వందో ప్రయోగాన్ని విజయవంతం చేయనుంది. భారత్-అమెరికా సంయుక్తంగా చేపడుతున్న ఈ ప్రయోగం ద్వారా అమెరికాకు చెందిన 'బ్లూ బర్డ్6' భారీ ఉపగ్రహాన్ని ఇస్రో అంతరిక్షంలోకి పంపనుంది. సుమారు 6.5 టన్నుల బరువు ఉన్న ఈ ఉపగ్రహాన్ని కక్షలోకి చేర్చడం ద్వారా ఇస్రో మరో కొత్త రికార్డును సష్టించనుంది. బుధవారం ఉదయం 8.54 గంటలకు జరగనున్న ఈ రాకెట్ ప్రయోగానికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయని ఇస్రో అధికారులు తెలిపారు. దీనికి సంబంధించిన కౌంట్ డౌన్ ప్రక్రియ మంగళవారం ఉదయం 8.54 గంటలకు కౌంట్ డౌన్ ప్రారంభం అయింది. ఇది నిరంతరం 24 గంటల పాటు కొనసాగిన అనంతరం ప్రయోగం జరగనుంది. శ్రీహరికోటలో ఉన్న సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం రెండో ప్రయోగ వేదిక నుంచి ఎల్వీఎం3 ఎం6 రాకెట్ ద్వారా బ్లూ బర్డ్ బ్లాక్ 2 వాణిజ్య ఉపగ్రహాన్ని ప్రయోగించనుంది. బ్లూ బర్డ్ శ్రేణి ఉపగ్రహం ద్వారా ప్రపంచవ్యాప్తంగా నేరుగా మొబైల్ బ్రాడ్ బ్యాండ్ సేవలు కోసం ఎంతగానో ఉపయోగపడుతుంది.

# శ్రీవారి ఆలయంలో శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**ప్రజాశక్తి- తిరుమల**

తిరుమల శ్రీవారి ఆలయంలో డిసెంబర్ 30వ తేదీన వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయం వెలుపల ఈఓ అనిల్ కుమార్ సింఘాల్ మీడియాతో మాట్లాడుతూ సాధారణంగా ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు వచ్చే మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ సందర్భంగా ఆనందనిలయం మొదలుకొని బంగారువాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప దేవాలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను పవిత్రమైన పరిమళ జలాన్ని ప్రోక్షణ చేసి, నీటితో శుభ్రంగా కడుగుతారని చెప్పారు. ప్రత్యేక పూజ, నైవేద్యం కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారని తెలిపారు.

**శ్రీవారి సేవలో రాష్ట్ర మంత్రులు**

తిరుమల శ్రీవారిని రాష్ట్ర మంత్రి బందం దర్శించుకున్నారు. మంగళవారం తిరుమలలో పర్యటించిన వారు వెంకటేశ్వర స్వామి సన్నిధిలో కొంత సమయం గడిపారు. దర్శన అనంతరం టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఆధ్వర్యంలో మంత్రులకు పట్టువస్త్రాలతో సన్మానం చేశారు. శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, హెూం శాఖ మంత్రి వంగలపూడి అనిత ఉన్నారు

**వైకుంఠ ద్వార దర్శనాలపై టిటిడి చైర్మన్ స్పష్టత**

తిరుమల వైకుంఠ ద్వార దర్శనాలపై సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న వదంతులను భక్తులు నమ్మవద్దని తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బీఆర్ నాయుడు స్పష్టం చేశారు. దర్శనాల షెడ్యూల్‌పై ఎలాంటి అయోమయం అవసరం లేదని, టీటీడీ విడుదల చేసే అధికారిక సమాచారం మాత్రమే నమ్మాలని ఆయన కోరారు. భక్తుల సౌకర్యం, భద్రతే ప్రధాన లక్ష్యంగా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

డిసెంబర్ 30, 31 అలాగే జనవరి 1 తేదీల్లో ఈ-డిప్ టోకెన్లు ఉన్న భక్తులకు మాత్రమే వైకుంఠ ద్వార దర్శనం కల్పిస్తామని, ఆ మూడు రోజుల్లో టోకెన్లు లేనివారికి దర్శనం ఉండదని బీఆర్ నాయుడు స్పష్టం చేశారు. అయితే జనవరి 2 నుంచి 8 వరకు టోకెన్లు లేని భక్తులకు కూడా సర్వదర్శనం ఉంటుందని తెలిపారు. టోకెన్లు లేకున్నా తిరుమలకు రావచ్చుని, భక్తులను ఎవరూ అడ్డుకోరని భరోసా ఇచ్చారు. నకిలీ టికెట్లు, తప్పుడు షోషల్ మీడియా ప్రచారాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## కాంట్రాక్ట్ కార్మికులకు దర్శన సౌకర్యం కల్పించాలి : సిఐటియు

**ప్రజాశక్తి- తిరుపతి టౌన్**

టిటిడిలో పనిచేస్తున్న ఎఫ్ఎంఎస్, హెల్త్, కళ్యాణకట్ట, అన్నదానం, హాస్పిటల్స్, గార్డెన్, వాటర్ వర్క్స్, ఎలక్ట్రికల్, విద్యాసంస్థలు, ఫారెస్ట్, శ్రీ లక్ష్మీ శ్రీనివాస మాన్ పవర్ కార్పొరేషన్, వివిధ సొసైటీలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరికీ వైకుంఠ ఏకాదశి రోజు శ్రీవారి దర్శన సౌకర్యం కల్పించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టి .సుబ్రమణ్యం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. టిటిడిలో దాదాపు 16 వేలమంది ఏళ్ల తరబడి వివిధ విభాగాలలో కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నప్పటికీ శ్రీవారి దర్శనం కల్పించడానికి టిటిడి యాజమాన్యం చర్యలు చేపట్టకపోవడం బాధాకరమన్నారు. రోజు వచ్చే వేలాది భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో అనేక కష్టాలను, పని భారాన్ని, పని ఒత్తిడిని భరిస్తూ సేవలందించడంలో ప్రధానమైన పాత్ర పోషిస్తున్నారని అన్నారు. భక్తులకు నిరంతరం సేవలందించే కాంట్రాక్ట్ కార్మికులకు దర్శన సౌకర్యం కల్పించాలనే ఆలోచన రాకపోవడం బాధాకరమన్నారు. అనేక సందర్భాలలో దర్శన సౌకర్యం కల్పించాలని సిఐటియు తరపున టిటిడి యాజమాన్యం దష్టికి తీసుకెళ్లిన నిమ్మక నీరెత్తినట్లు వ్యవహరించడం సరైనది కాదన్నారు. శ్రీవారి సేవకులకు కల్పించే సౌకర్యాలు కూడా, కాంట్రాక్ట్ కార్మికులకు కల్పించకపోవడం తీవ్రమైన వివక్షేనని పేర్కొన్నారు. ఒకరకంగా చెప్పాలంటే నిత్యం సేవ చేస్తున్న కార్మికులను అవమానపరచడమేనని, ఈ వైఖరి సరైనది కాదని అన్నారు. ఇప్పటికైనా టిటిడి యాజమాన్యం సానుకూలంగా స్పందించి కాంటాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులకు అందరికీ వైకుంఠ ఏకాదశికి శ్రీవారి దర్శనం కల్పించాలని టి .సుబ్రమణ్యం టిటిడి యాజమాన్యాన్ని కోరారు.

కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయుల నిరసన

## ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి : యుటిఎఫ్

**ప్రజాశక్తి -తిరుపతి టౌన్**

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. యుటిఎఫ్ తిరుపతి జిల్లా శాఖ మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ కార్యాలయం, జిల్లా డీఈవో కార్యాలయం వద్ద ఈ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులుగా జి జె రాజశేఖర్, ప్రధాన కార్యదర్శిగా కె ముత్యాల రెడ్డి మాట్లాడుతూ సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ రద్దు చేసి ఓ పి ఎస్ అమలు చేయాలని కోరారు. బోధనేతర పనుల నుండి ఉపాధ్యాయులకు మినహాయింపు. ఇవ్వాలని తెలిపారు ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు ఎస్ఎస్ నాయుడు, గౌరవ అధ్యక్షులుగా డి రామచంద్రయ్య, సహా అధ్యక్షులుగా ఎం కుమారస్వామి, ఈ. గీతమ్మ కోశాధికారిగా మోహన్ బాబు , జిల్లా కార్యదర్శులుగా బండి మధుసూదన్ రెడ్డి , ఎన్ శేఖర్ ,కె ప్రభాకర్ , మస్తానయ్య , సి సురేష్ , సి వెంకటకష్ణ , ఏ పద్మజ , కే ఆదినారాయణ ( వెంకటగిరి), టి గోవర్ధన రెడ్డి , కే మోహన్ రెడ్డి , రాష్ట్ర కౌన్సిలర్లు దేవరాల నిర్మల , పత్తిపాటి రమేష్ నాయుడు (పాకాల), పి. వాసుదేవరావు (గూడూరు అర్బన్) పాల్గొన్నారు.

## కాళికమ్మకు ఆర్థిక విరాళం

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి**

శ్రీకాళహస్తి మండలంలోని వేడాం దక్షిణ కాళికామాతా ఆలయానికి పంజాబ్ రాష్ట్రంలోని లూధియానాకు చెందిన స్క్వేర్ కార్పొరేషన్ కంపెనీ సీఈఓ ఆర్యమన్ వర్మ మంగళవారం రూ. 2.5 లక్షలు విరాళంగా అందజేశారు. ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో ఆలయ నిర్వహకులకు అందజేసి అభివద్ధి కార్యక్రమాలకు వినియోగించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. మాజీ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి తనయుడు బియ్యపు ఆకర్ష రెడ్డి, అన్షజైన్, నిపున్ కన్నా, అభిషేక్ గారాని తదితరులు ఉన్నారు.

## శివుని దర్శించుకున్న దేవాదాయ శాఖ కార్యదర్శి

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి**

రాష్ట్ర దేవాదాయ శాఖ కార్యదర్శి హరి జవహర్‌లాల్ ఐఏఎస్ మంగళవారం శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు. వీరికి ఆలయ ఈవో బాపిరెడ్డి సాదర స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేద పండితులు ఆశీర్వచనాలు పలికి ముక్కంటి తీర్థప్రసాదాలు, జ్ఞాపికలు అందజేశారు. అనంతరం హరి జవహర్‌లాల్ ఆలయంలో పలుచోట్ల తనిఖీలు చేపట్టి మహాశివరాత్రి ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు.

## అయ్యప్ప భక్తులకు తప్పిన ప్రమాదం

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి**

ముక్కంటి దర్శనార్థం శ్రీకాళహస్తికి వచ్చిన అయ్యప్ప భక్తులకు మంగళవారం తటిలో ప్రమాదం తప్పింది. వారు ప్రయాణిస్తున్న ప్రయివేటు ట్రావెల్ బస్సుకు బ్రేకు ఫెయిలై శ్రీకాళహస్తీశ్వరాలయానికి సమీపంలోని భక్త కన్నప్ప వంతెన రక్షణ గోడను ఢీకొట్టింది. ఈ క్రమంలో బస్సు ఆగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. దురదష్టవశాత్తు బస్సు మరికొంత ముందుకు దూసుకుపోయి ఉంటే నదిలో పడిపోయి సుమారు 50 మంది అయ్యప్ప భక్తులు తీవ్ర గాయాలపాలయ్యే వారే. అదష్టవశాత్తు అలాంటి ప్రమాదమేమీ జరగకపోవడంతో భక్తులు ఊపిరి పీల్చుకున్నారు. అనంతపురం దర్శికి చెందిన అయ్యప్ప భక్తుల శబరిమల యాత్రను ముగించుకొని, వెంకన్నను దర్శించుకుని, ముక్కంటి దర్శనార్థం వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

## 10,11 తేదీల్లో ఫ్లెమింగో ఫెస్టివల్

**ప్రజాశక్తి - దొరవారిసత్రం**

ఫ్లెమింగో ఫెస్టివల్‌కు వచ్చే పర్యాటకులకు మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని టూరిజం రీజినల్ డైరెక్టర్ రమణప్రసాద్ సూచించారు. మంగళవారం నేలపట్టు పక్షుల వసతి కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనవరి 10, 11 తేదీల్లో ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు చెప్పారు. వైద్యం, తాగునీరు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. పర్యాటకులకు భోజన వసతి కల్పించాలన్నారు. పక్షుల కేంద్రంలో గైడ్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. డిఎఫ్ఓ హారిక, డిఎస్పి చెంచుబాబు, తహశీల్దారు శైలకుమారి, ఎస్ఐ అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## హిందీ సలహా కమిటీ సభ్యుడుగా పిసి రాయల్

**ప్రజాశక్తి -తిరుపతి సిటీ**

ప్రముఖ పారిశ్రామిక వేత్త డాక్టర్ పిసిరాయల్‌ను ఓడరేవులు షిప్పింగ్ జల మార్గాల మంత్రుల శాఖ పరిధిలోని హిందీ సలహా కమిటీ సభ్యుడిగా నియమిస్తూ భారత ప్రభుత్వ హోం వ్యవహారాల శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. తిరుపతికి చెందిన ఈయన మూడేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. డాక్టర్ పి సి రాయల్ గతంలో ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమల మంత్రిత్వ శాఖ, గ్రామీణ అభివద్ధి, పంచాయతీరాజ్ శాఖ, రైల్వే శాఖ, ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, బొగ్గు గనులు శాఖ వంటి కీలకమైన మంత్రిత్వ శాఖలో చట్టబద్ధమైన సభ్యుడిగా కొనసాగారు. ప్రజా పరిపాలన, విధాన సలహా రంగాలలో ఆయనకు విశేష అనుభవం ఉంది. హిందీ సలహా మండలి సభ్యుడిగా ఎన్నికైన ఆయనను పలువురు అభినందించారు.

## కె.వి చౌదరికి విశిష్ట అవార్డు ప్రదానం

**ప్రజాశక్తి -తిరుపతి టౌన్** ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ ఉపాధ్యక్షులు కేవీ చౌదరికి వివిధ సేవలు అందించడంతో ఆయనకు విశిష్ట అవార్డును గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు సోమవారం గోవా రాజభవన్లో సత్కరించారు.ప్రజాడైరీ మాస పత్రిక 25 వసంతాలు పూర్తయిన సందర్భంగా పలు రంగాల్లో సేవలు అందించిన వారికి అవార్డులను ప్రదానం చేశారు. ఇందులో కె.వి చౌదరికి విశిష్ట అవార్డు ద్వారా సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా కె.వి చౌదరి మాట్లాడుతూ గోవా గవర్నర్ వద్ద ఈ అవార్డు అందుకోవడం చాలా ఆనందం కలిగించిందన్నారు. పూసపాటి అశోక్ గజపతిరాజు వివిధ మెడికల్ కళాశాలలో యూనివర్సిటీలకు భూములు ఉచితంగా అందించడమే కాకుండా సింహాచలం ఆలయం అభివద్ధికి ఎన లేని కషి చేశారన్నారు. చాలామంది పేదలకు గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు ఉచిత విద్యను అందించేలా కషి చేశారన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో వ్యాపారస్తుల కోసం చేసిన సేవ కార్యక్రమాలు గుర్తించి ప్రజా డైరీ మాసపత్రిక సెలబ్రెటీగా అవార్డు ఎంపిక చేయడం కాకుండా గోవా గవర్నర్ దగ్గర తీసుకోవడం తో తనపై మరింత బాధ్యత పెరిగింది అన్నారు.

## బ్రీత్ అనలైజర్ పరికరాలు పంపిణీ

**ప్రజాశక్తి- రేణిగుంట** రేణిగుంట విమానాశ్రయం వద్ద తిరుపతి జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమంలో రాష్ట్ర హెూంశాఖ మంత్రి అనిత, రాష్ట్ర రెవెన్యూ, జిల్లా ఇంచార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ పాల్గొని బ్రీత్ అనలైజర్ పరికరాలను అందజేశారు.

### జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో..

## 26-29 తేదీల్లో భారతీయ విజ్ఞాన సమ్మేళనం

ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

**ప్రజాశక్తి - క్యాంపస్**

"సమగ్రవికాసానికి భారతీయ చింతన" అనే భావనతో డిసెంబర్ 26 నుండి 29 వరకు నాలుగు రోజుల పాటు దేశంలోని 32 రాష్ట్రాలనుండి, కేంద్రపాలిత ప్రాంతాల నుండి వచ్చే 1250 మంది ప్రతినిధులతో భారతీయ విజ్ఞాన సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు విసి ఆచార్య కష్ణమూర్తి వెల్లడించారు. భారతీయ విజ్ఞాన సమ్మేళనం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథి, ప్రధానవక్తగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్, సర్ సంఘచాలక్ మోహన్ భగవత్, విశిష్ట, గౌరవ అతిథులుగా రాష్ట్ర సిఎం నారా చంద్రబాబునాయుడు, కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి డా. జితేంద్ర సింగ్, ఎన్ఎస్ఎ బోర్డు సభ్యులు, డిఆర్‌డిఓ పూర్వ చైర్మన్ డా. సతీశ్ రెడ్డి, సిఎస్ఐఆర్ పూర్వ డైరెక్టర్ జనరల్ డా. శేఖర్ మాండే హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సమ్మేళనంలో 900 మంది ప్రతినిధులు శాస్త్రసాంకేతిక రంగాలలోని నూతన ఆవిష్కరణలు, భారతీయవిజ్ఞాన వైభవం గురించి తమ పరిశోధనాత్మకమైన, ఆలోచనాత్మకమైన పరిశోధనాపత్రాలను, పోస్టర్స్‌ను సమర్పించనున్నారు. ఈ సమ్మేళనంలో వివిధ పరిశోధన సంస్థల డైరక్టర్లు, విశ్వవిద్యాలయాల ఉపకులపతులు పాల్గొని వివిధ అంశాలపై ప్రసంగించనున్నారు.

భారతీయ విజ్ఞాన సమ్మేళనంలో శాస్త్రవేత్తలతో ఆసక్తి కరమైన చర్చా కార్యక్రమాలు, ముఖాముఖి, సైన్స్ బుక్ ఫెయిర్, సైన్స్ మ్యాజిక్ షో, స్కూల్ విద్యార్థులకు ప్రత్యేకపోటీలు, భారతీయతని చాటిచెప్పే సాంస్కృతిక కార్యక్రమాలు వంటి ఎన్నో కార్యక్రమాలు జరగనున్నాయి. సైన్స్ అండ్ టెక్నాలజీ ఎక్స్‌పో ప్రదర్శన ఉంటుంది.

**భద్రతాపరంగా అన్ని ఏర్పాట్లు**

ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు తిరుపతి జిల్లాలోని భారతీయ విజ్ఞాన్ సమ్మేళనం ఘనంగా నిర్వహించనున్నామని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ చెప్పారు. భద్రతాపరంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎస్పి సుబ్బారాయుడు తెలిపారు. మంగళవారం జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయంలో భారతీయ విజ్ఞాన్ సమ్మేళనం ఏర్పాట్లను ఆర్ఎస్ఎస్ జాతీయ కార్యదర్శి సుబ్బరాజు శాస్త్రి, ఎస్పి సుబ్బరాయుడు, ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ ఎన్.మౌర్య, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్షి, ఎపి హస్తకళ కార్పొరేషన్ ఛైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, ఆర్డీవో రామ్మోహన్,వ ఇద్యాశాఖ అధికారి కెవిఎన్ కుమార్‌తో కలిసి పరిశీలించారు.

ఎస్వీయూలో ప్రీ క్రిస్మస్ వేడుకలపై భజరంగ్‌దళ్ కార్యకర్తల తీరు నిరసిస్తూ ...

## ఎస్వీయూలో మత సామరస్యాన్ని కాపాడాలి

**ప్రజాశక్తి - క్యాంపస్**

శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ప్రీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రకాశం భవనం ఎదుట జరిగిన ఈ కార్యక్రమంలో లౌకిక విలువలను ప్రతిబింబించే విధంగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాంట తాత వేషధారణలో ఉన్న పరిశోధక విద్యార్థి అశోక్‌కుమార్‌ను బయటి వ్యక్తులైన భజరంగ్‌దళ్ కార్యకర్తలు అడ్డుకుని కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. దీంతో విద్యార్థిసంఘాల నాయకులు తీవ్రంగా ప్రతిఘటించారు. అనంతరం ఈ ఘటనపై కేసు నమోదు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా, అక్కడ కూడా పెద్ద సంఖ్యలో భజరంగ్ దళ్ కార్యకర్తలు చేరి ఉద్రిక్తత సష్టించారు. ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.

తదనంతరం విద్యార్థి సంఘాలు నేరుగా వర్సిటీ రిజిస్ట్రార్‌ను కలిసి, యూనివర్సిటీ విద్యార్థులపై దాడులకు పాల్పడిన బయట వ్యక్తులపై తక్షణమే కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. దీనిపై స్పందించిన రిజిస్ట్రార్ భూపతి నాయుడు, యూనివర్సిటీ ప్రాంగణంలోకి అక్రమంగా ప్రవేశించి విద్యార్థులపై దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేస్తూ, క్యాంపస్ పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు పంపించారు. ఈ సందర్భంగా లౌకిక విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ యూనివర్సిటీలలో లౌకిక భావజాలాన్ని బలపరుస్తూనే ఉంటామన్నారు. మతోన్మాద శక్తుల నుంచి విద్యాసంస్థలను కాపాడుకోవడం కోసం విద్యార్థి ఉద్యమాలు ఎపుడూ ముందుంటాయన్నారు. ఈ ధర్నాలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అక్బర్, రవి, ఏఐఎస్ఎఫ్ యూనివర్సిటీ ఇంచార్జ్ చిన్న, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఉదయ్, ప్రవీణ్, వైయస్సార్ విద్యార్థి విభాగం వర్సిటీ అధ్యక్షులు ప్రేమ్ కుమార్, నెల్స వ్యవస్థాపకులు సుందర్ రాజు, ఎన్ఎస్ యూఐ రాష్ట్ర కార్యదర్శి జెన్నీ మల్లికార్జున, జిఎన్ఎస్ వ్యవస్థాపకులు శివ శంకర్ నాయక్, ఆంధ్రప్రదేశ్ విద్యార్థి హక్కుల సంఘం అధ్యక్షులు ముని, నిఘా నేత్ర హరికృష్ణ నాయక్, బీసీ ఎస్ యు జిల్లా అధ్యక్షుడు తిరుమలేష్, నాయకులు వినోద్, నరసన్న, చక్రి, శ్రీకాంత్, తిరుమలేష్ పాల్గొన్నారు

## వెంకటబ్రహ్మానాయుడుకు డాక్టరేట్ ప్రదానం

**ప్రజాశక్తి - క్యాంపస్**

అన్నామలై విశ్వవిద్యాలయంలోని ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం పరిశోధక విద్యార్థి దేవినేని వెంకట బ్రహ్మానాయుడుకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వర్సిటీ డైరెక్టరేట్ అఫ్ అకాడమిక్ రీసెర్చ్ డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం అధ్యాపకుడు ఆచార్య ఆర్. తమిల్ సెల్వన్ పర్యవేక్షణ, ఎస్వీయూ అధ్యాపకుడు ఆచార్య సి.హెచ్.చెంగయ్య సహ పర్యవేక్షణలో "మైక్రోగ్రిడ్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత పవర్ క్వాలిటీ, నియంత్రణ వ్యూహాలు" అనే సిద్ధాంత వ్యాసం వర్సిటీకి సమర్పించినట్లు వివరించారు. ఇందుకుగాను బ్రహ్మ నాయుడుకు డాక్టరేట్ డిగ్రీ ప్రదానం చేస్తున్నట్లు వెల్లడించారు. బ్రహ్మానాయుడు పలు జాతీయ, అంతర్జాతీయ పరిశోధనా జర్నల్స్ లలో అనేక పరిశోధనా వ్యాసాలను ప్రచురించినట్లు చెప్పారు. ఎస్వీయూ ఒప్పంద అధ్యాపకుడు దేవినేని వెంకట బ్రహ్మానాయుడు నెల్లూరు జిల్లా కొండాపురం మండలం కొమ్మి గ్రామానికి చెందిన దేవినేని శ్రీనివాసులు కుమారుడు.

# పట్టా భూమిలో అక్రమంగా వరిసాగు

**ప్రజాశక్తి-వెంకటగిరి(డక్కిలి)**

డక్కిలి మండలం పాతనాలపాడు గ్రామంలో తన సొంత పట్టా భూమిలో అదే గ్రామానికి చెందిన గొల్లపల్లి సొసైటీ సీఈవో జి శ్రీనివాసులు అక్రమంగా చొరబడి వరి నాట్లు వేశాడని, అడిగితే పరుషపదజాలంతో బెదిరిస్తూ దాడి చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని ఆ గ్రామానికి చెందిన ఘట్టమనేని శ్రీనివాసులు అనే రైతు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. డక్కిలి మండలం పరిధిలోని పాతనాలపాడు సర్వే నంబర్ 22-5లో తనకు 0.05 సెంట్లు వారసత్వంగా వచ్చిన పట్టాభూమి ఉందని, దానికి సంబంధించి చట్టపరమైన 1 బి, అడంగల్ , మూడు దశాబ్దాలకు పైగా తమ పూర్వీకుల పేరుతో రెవెన్యూ రికార్డులు ఉన్నాయని తెలిపారు. గత ఏడాది గ్రామంలో జరిగిన రి సర్వే సందర్భంగా తన భూమి ఇతరుల ఆక్రమణలో ఉందని గుర్తించి గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో హద్దులు చూపాలని అధికారులకు విన్నవించుకోగా, గూడూరు డివిజనల్ సర్వేయర్ తన సిబ్బందితో ఈ ఏడాది జూన్ 5వ తేదీన తన పొలంకు హద్దురాళ్ళు వేయించారని తెలిపారు. అయితే గత కొన్ని రోజులుగా అదే గ్రామానికి చెంది డక్కిలి మండలం గొల్లపల్లి సొసైటీ సీఈఓ గా పనిచేస్తున్న జి శ్రీనివాసులు తండ్రి వెంకటసుబ్బయ్య బలవంతంగా భూమిలోకి ప్రవేశించి ఆక్రమించేందుకు సర్వే అధికారులు ఏర్పాటు చేసిన హద్దురాళ్లను గత నవంబర్ 27వ తేదీ పీకేశారు. ఉపాధి నిమిత్తం వెంకటగిరిలో నివాసం ఉన్న బాధితుడు ఆ విషయం తెలుసుకుని 28వ తేదీ రెవెన్యూ, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. అంతేకాకుండా నాలుగు రోజుల క్రితం అక్రమంగా దౌర్జన్యంగా ఆ భూమిని దున్ని వరి నాట్లునారు వేశాడని, ప్రశ్నిస్తే పరుష పదజాలంతో దూషిస్తూ దాడికి ప్రయత్నిస్తున్నాడని బాధితుడు ఆరోపించారు. భూమిపై స్పష్టమైన యాజమాన్య హక్కులు ఉన్నప్పటికీ, అక్రమంగా ఆక్రమణకు పాల్పడటంపై బాధితుడు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ఇప్పటికే స్థానిక రెవెన్యూ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేశానని వారు ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవడంలో జాప్యం చేస్తున్న కారణంగా ఆక్రమణదారుడు రెచ్చిపోతున్నారని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, తన భూమి నుంచి అక్రమదారుడిని తొలగించి తనకు న్యాయం చేయాలని ఆయన కోరుతున్నారు.

### మళ్లీ మహంతుగా అర్జున్ దాస్..?

## సుప్రీంకోర్టు తాత్కాలిక స్టే

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)**

తాత్కాలిక మహంతుగా కొనసాగుతున్న ఓం ప్రకాష్ దాస్

శ్రీ స్వామి హథీరాంజీ మఠం మహంతుగా పనిచేసిన అర్జున్ దాస్ మళ్లీ తన పగ్గాలు తిరిగి చేపట్టడానికి వస్తారా..? అంటే వాస్తవిక పరిస్థితులు అలాగే కనిపిస్తున్నాయి. గతంలో మహంతుగా పనిచేసిన అర్జున్ దాస్ అక్రమాలు, భూ బదలాయింపులలో కీలక పాత్ర ఉందని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ధార్మిక పరిషత్ చేసిన తీర్మానం మేరకు రాష్ట్ర ప్రభుత్వం అర్జున్ దాస్‌ను మహంతు పదవి నుండి తప్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అటు తరువాత మఠం ఫిట్ పర్సన్ గా రమేష్ నాయుడు బాధ్యతలు చేపట్టడం, అటు తరువాత పలువురు అధికారులు రావడం తెలిసిందే. ధార్మిక పరిషత్ ఇచ్చిన అర్జున్ దాస్ తొలగింపు తీర్మానంపై హైకోర్టును ఆశ్రయించగా అక్కడ చుక్క ఎదురయింది. ధార్మిక పరిషత్ ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ రాష్ట్ర హైకోర్టు అర్జున్ దాస్ పిటీషన్‌ను కొట్టి వేసింది. తన తొలగింపు ఆక్షేపణీయమైన తీర్పు ఇచ్చారని అర్జున్ దాస్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు అర్జున్ దాస్ దాఖలు చేసిన పిటిషన్ పై స్పందించి ఆయన తొలగింపు ఉత్తర్వులకు స్టే ఇచ్చింది. ప్రస్తుతం తాత్కాలిక మహంతుగా కొనసాగుతున్న ఓం ప్రకాష్ దాస్ ఈనే మహంతుగా అయ్యే అవకాశాలు ఉన్న నేపథ్యంలో అర్జున్ దాస్ రీ ఎంట్రీపై ఆసక్తి నెలకొంది.

## పట్టాభిరామ ఆలయ క్యాలెండర్ ఆవిష్కరణ

క్యాలెండరును ఆవిష్కరిస్తున్న కోడవలూరు దామోదర్‌రెడ్డి

**ప్రజాశక్తి- వాకాడు:** మండలంలోని బాలి రెడ్డిపాళెం శ్రీ పట్టాభి రామ ఆలయం లో 2026 ఆంగ్ల నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆలయ ధర్మకర్త, మాజీ సొసైటీ ఛైర్మన్ కోడవలూరు దామోదర్‌రెడ్డి చేతుల మీదుగా మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయంలోని విశేషమైన చిత్రాలతో క్యాలెండరును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారని తెలిపారు. ఆర్థికంగా సహకరించిన భక్తులకు, దాతలకు, ప్రోత్సహించిన పాత్రికేయులు సతీష్ కుమార్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మనోహర్ రెడ్డి, నరేంద్ర రెడ్డి, శ్రీరామసేన అధ్యక్ష, కార్యదర్శులు హరీష్ కుమార్ రెడ్డి, శివకుమార్, వంశీ, వినయ్ ఆలయ ప్రధాన అర్చకులు దీవి అనంతాచార్యులు పాల్గొన్నారు.

## టీడీపీ నేత మునిశేఖర్ రెడ్డికి పరామర్శ

మునిశేఖర్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

**ప్రజాశక్తి -పిచ్చాటూరు:** పిచ్చాటూరు మండలం తులసి కృష్ణాపురానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు మునిశేఖర్ రెడ్డిని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మంగళవారం పరామర్శించారు. మునిశేఖర్ రెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స అనంతరం తన ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే ఉదయం మునిశేఖర్ రెడ్డి ఇంటికి చేరుకొని ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మునిశేఖర్ రెడ్డి త్వరగా కోలుకుని మళ్లీ ప్రజా జీవితంలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ డి ఇలంగోవన్ రెడ్డి, టిడిపి నేత దీనదయాళ్ పాల్గొన్నారు.

## శ్రీధర్‌కు డాక్టరేట్

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్:** శ్రీవిద్య డిగ్రీ కళాశాలలో కామర్స్ అధ్యాపకుడిగా పని చేస్తున్న డాక్టర్ పి.శ్రీధర్ పిహెచ్‌డి పొందారు. శ్రీధర్ తమిళనాడు, చిదంబరంలోని అన్నామలై యూనివర్శిటీ చెందిన ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.బిల్ రాజ పర్యవేక్షణలో కామర్స్ విభాగంలో స్టడీ ఆన్ ప్రొడక్షన్ అండ్ మార్కెటింగ్ ప్రొబ్లమ్స్ ఆఫ్ పవర్ లూమ్ ఇండస్ట్రియల్ యూనిట్స్ ఇన్ చిత్తూర్ డిస్ట్రిక్ట్, ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించినందుకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శ్రీవిద్య డిగ్రీ కళాశాల చైర్మన్ డాక్టర్ ఉమామహేశ్వర్ మాట్లాడుతూ చిత్తూరు జిల్లా వ్యాప్తంగా పవర్ లూమ్ ఇండస్ట్రీ చాలా కుటుంబాలకు జీవనోపాధి కల్పిస్తున్న తరుణంలో ఈ పవర్ లూమ్ ఇండస్ట్రీ పై పరిశోధనలు చేసి శ్రీధర్ డాక్టరేట్ పొందడం చిత్తూరు జిల్లా వాసులకు ఎంతో గర్వకారణమని తెలిపారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మాణిక్యం, ఎంబీఏ, ఎంసీఏ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపీలు అధ్యాపకులు శ్రీధర్ కు అభినందనలు తెలిపారు.

## బత్తెయ్యకు పరామర్శ

బత్తయ్యను పరామర్శిస్తున్న టిడిపి నాయకులు

**ప్రజాశక్తి- శ్రీకాళహస్తి రూరల్ ( తొట్టంబేడు ):** మండలంలోని వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్ బత్తెయ్య అనారోగ్య కారణంతో వారం రోజులుగా తిరుపతిలోని సిమ్స్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న తొట్టంబేడు మండల టిడిపి అధ్యక్షుడు రావిళ్ళ మునిరాజు నాయుడు మంగళవారం సిమ్స్ ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి రూరల్ మండల టిడిపి మాజీ మండల అధ్యక్షులు కామేష్ యాదవ్, బాలాజీ రెడ్డి, ఢిల్లీ బాబు పాల్గొన్నారు.

## గంగా ప్రసాద్‌ను కలిసిన ఎమ్మెల్యే

**ప్రజాశక్తి -పిచ్చాటూరు:** ప్రముఖ పారిశ్రామిక వేత్త గంగా ప్రసాద్‌ని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మంగళవారం సాయంత్రం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిద్దరూ సత్యవేడు నియోజకవర్గంలో అభివృద్ధి పనులపై చర్చించారు.

## గుడిమల్లం ఆలయంలో ప్రత్యేక పూజ

**ప్రజాశక్తి -ఏర్పేడు :** గుడిమల్లం దేవస్థానంలో కొత్తగా ఆరుద్ర నక్షత్రంలో వస్త్ర సేవ పూజ ప్రారంభించామని, ఈ సేవలో భక్తులు కుటుంబ సమేతంగా పాల్గొనవచ్చునని ఆలయ ఈవో రామచంద్ర రెడ్డి తెలిపారు. ఈ టికెట్ ధర ఐదు వేల రూపాయలతో పాటు స్వామి వారికి తొమ్మిది ఇంటు ఐదు పట్టు పంచె, ఆరు అడుగుల పూలమాల, పూజా సామగ్రి దేవస్థానానికి చెల్లించాలని, ఈ వస్త్ర సేవ పూజ చేసుకున్న భక్తులకు స్వామి వారి పట్టు శేష వస్త్రం, లడ్డు, వడ కొబ్బరికాయ, అన్న ప్రసాదం, స్వామి విభూది బ్యాగు ఇస్తారని ఆయన తెలిపారు.

## వ్యక్తిగత కక్షతో పాఠశాల అభివృద్ధికి అడ్డు

మాట్లాడుతున్న మునికుమార్

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం దానం చేసిన భూమిలో పాఠశాల నిర్మించి పిల్లలకు పాఠాలు బోధించే ప్రదేశంలో అక్రమ నిర్మాణాలను అడ్డుకున్నందుకు వ్యక్తిగత కక్షను పెంచుకొని నేడు పాఠశాల అభివృద్ధికి అడుగడుగునా ఆటంకం కలిగిస్తున్నారని ఐరాల మండలానికి చెందిన ముని కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. అధికార పార్టీకి సంబంధించిన కూటమి పార్టీలలో అన్నదమ్ములు ఇద్దరు నాయకులుగా చలామణి అవుతూ పిల్లల భవిష్యత్తుకు ఉపయోగపడే పాఠశాల భవన ప్రాంగణాన్ని ఆక్రమించుకోవాలని చూడడం, అడ్డుకున్న తనపై వ్యక్తిగతంగా కక్ష పెంచుకోవడమే కాకుండా తన స్వాధీన అనుభవంలోని ఇంటికి సంబంధించి నకిలీ డాక్యుమెంట్లను సృష్టించి ఇబ్బందులు పెట్టాడన్నారు. ప్రస్తుతం అంగన్వాడీ భవన నిర్మాణం కూడా నిర్మాణ దశలో ఉందని, ఈ పాఠశాలకు సంబంధించిన విషయాలను కలెక్టర్ సుమిత్ కుమార్ కు అర్జీ ఇచ్చి ఫిర్యాదు చేసామన్నారు. ఇప్పటికైనా చిత్తూరు కలెక్టర్ స్పందించి ఈ అరాచక అక్రమ వ్యవహారాన్ని పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నానని అన్నారు.

## నారావారిపల్లెలో అభివృద్ధి పనుల పరిశీలన

### సంక్రాంతికి సీఎం చేతుల మీదుగా ప్రారంభం

**ప్రజాశక్తి -చంద్రగిరి:** చంద్రగిరి మండలం నారావారిపల్లెలో జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం పంచాయతీరాజ్ అధికారులు పరిశీలించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాది అవకాశాలు కల్పించడానికి ముందుగా శిక్షణా నైపుణ్యం పెంపొందించడానికి నారావారిపల్లెలో రూ.140 కోట్ల నిధులతో స్కిల్ డెవలప్మెంట్ భవనం నిర్మిస్తున్నారు. అయితే ఈభవన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అదేవిధంగా శేషాపురం వద్ద శేషాచల లింగేశ్వర ఆలయానికి, ప్రధాన రహదారి నుంచి ఆలయానికి రూ.17 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం రుగుతోంది. ఈపనులు కూడా శరవేగంగా సాగుతున్నాయి. ఈరెండు నిర్మాణ పనులను మంగళవారం పంచాయతీరాజ్ ఈఈ మధుసుదన్, డీఈఈ మురళీదర్, ఏఈఈ రాజాజీలు పరిశీలించారు. సంక్రాంతి పండుగకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ప్రతిఏటా స్వగ్రామం నారావారిపల్లెకు రావడం ఆనవాయితీ. దీంతో ఈరెండు అభివృద్ధి పనులను సీఎం, మంత్రి లోకేష్ చేతులు మీదుగా ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

## కరెంటోళ్ల జనబాటకు శ్రీకారం

**ప్రజాశక్తి- కేవీబీ పురం:** కేవీబీ పురం మండలంలోని మోరిస్ కండ్రిగలో స్థానిక విద్యుత్ శాఖ అధికారులు కరెంటోళ్ల జనబాటకు శ్రీకారం చుట్టారు. మంగళవారం కేవీబీ పురం విద్యుత్ శాఖ ఎస్ మునుకుమార్ ఆధ్వర్యంలో విద్యుత్ బృందం మోరేసి కండ్రిగ పర్యటించి అక్కడ విద్యుత్ సమస్యలు సంబంధించి స్థానిక ప్రజాప్రతినిధులు,వినియోగదారులతో ఆరా తీశారు. ఈ నేపథ్యంలో దెబ్బతిన్న ఆరు విద్యుత్ స్తంభాలను గుర్తించారు. వీటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడానికి అంచనాలను సిద్ధం చేసి ఉన్నతాధికాలకు పంపి పరిష్కరిస్తామని విద్యుత్ ఏఈ ముని కుమార్ చెప్పారు. ఆర్డిఎస్ఎస్ పథకం కింద ఏర్పాటు చేసిన 100 కెవి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పరిశీలించారు. పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్నామని సత్యవేడు విద్యుత్ శాఖ ఏఈ మును కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు జేఎల్ఎంలు, వినియోగదారులు పాల్గొన్నారు.

**శ్రీకాళహస్తి రూరల్ ( తొట్టంబేడు):** మండలంలోని కారాకొల్లు పంచాయతీలో మంగళవారం విద్యుత్ శాఖ అధికారులు కరంటోళ్ల జనబాట కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మండల విద్యుత్ శాఖ ఏ.ఈ బాలాజీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు మేరకు ఇకనుంచి ప్రతి మంగళవారం, శుక్రవారం మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకొని ఆ గ్రామాల్లో విద్యుత్ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్ భాస్కరన్ జన్మదినం

ఎన్ భాస్కరన్‌ను సన్మానిస్తున్న కోనేటి సుమన్ కుమార్

**ప్రజాశక్తి -పిచ్చాటూరు:** నారాయణవనం మండలం వెంకట కృష్ణ పాలెంకు చెందిన రాష్ట్ర టిడిపి మొదలియార్ డైరెక్టర్ ఎన్ భాస్కరన్ జన్మదినం మంగళవారం ఘనంగా నిర్వహించారు. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తనయుడు, చిత్తూరు ఉమ్మడి జిల్లాల జెడ్‌పి ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్ కుమార్ ఆయన కార్యాలయంలో జన్మదిన శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. దుశ్శాలువ కప్పి భారీ గజమాలతో సత్కరించారు. ప్రజాసేవే ధ్యేయంగా ఎన్ భాస్కరన్ టిడిపి అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమన్నారు. మొదలియార్ కులస్తుల సంఘానికి ఆయన సేవలు ఎంతో అవసరమన్నారు.భవిష్యత్తులో మరిన్ని జన్మదిన వేడుకలను చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మాణిక్యం రెడ్డి, సర్పంచ్ రమేష్ బాబు, మాజీ సర్పంచ్ ఎస్ శంకరయ్య, బాలికల ఉన్నత పాఠశాల ఛైర్మన్ మోహన్ ఖలీల్ భాయ్ చంద్రశేఖర్, గోవిందరాజులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనుల పరిశీలన

**ప్రజాశక్తి -రామచంద్రపురం:** మండలంలోని ఉపాధి హామీ అభివృద్ధి పనులను చత్తీస్‌ఘడ్ చెందిన ఉపాధి హామీ సిబ్బంది బృందం పరిశీలించింది. మంగళవారం మండలంలోని కుప్పం బాదురు, మిట్ట కండ్రిగ, గంగిరెడ్డిపల్లి, కమ్మ కండ్రిగ గ్రామాల్లో పర్యటించారు. మండలంలో ఉపాధి హామీ కింద చేపట్టిన ఫారం పాండ్స్, మామిడి చెట్ల పెంపకం, ఖండిత కందకాలు, సిమెంట్ రోడ్ల నిర్మాణం, పశువుల నీటి తొట్టెలు, మ్యాజిక్ డ్రీన్స్, విలేజ్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాలను పరిశీలించారు. ఉపాధి హామీ పనులు అద్భుతంగా ఉన్నాయని బృందం సభ్యులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో డ్వామా సంచాలకులు శ్రీనివాస ప్రసాద్, ఎంపీడీవో పులిరాం సింగ్, ఏపీడి రెడ్డప్ప, గుణశేఖర్, ఏపీవోలు సుజాత చంద్రశేఖర్ రాజు, జేఈ భాగ్యలక్ష్మి, సాంకేతిక సహాయకులు ఆరోగ్య, గోపి, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

**ఏర్పేడు:** చత్తీస్‌ఘడ్ ఉపాధి హామీ అధికారులు వారి సిబ్బంది ఎక్స్పోజర్ విసిట్‌కు మండలంలోని బండారపల్లి పంచాయతీకి మంగళవారం విచ్చేశారు. బండారిపల్లి లో ఉపాధి హామీ నిధులతో చేపట్టిన అమృత్‌సరోవర్‌ను, కన్వర్జెన్సీ పనులైన సిసి రోడ్డును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఐ ఆర్ డి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వి సురేష్ బాబు , ఏపీడీలు వరప్రసాద్, సునీల్, ఈటిసి కోఆర్డినేటర్ జె కే రెడ్డి, ఎంపీడీవో సౌభాగ్యమ్మ, ఏపీవో టి. సుజాత పాల్గొన్నారు.

## ఆదర్శ పౌల్ట్రీ రైతుకు ఘన సన్మానం

**ప్రజాశక్తి - పిచ్చాటూరు:** భారత మాజీ ప్రధాని చౌదరి చరణ్ సింగ్ జయంతిని పురస్కరించుకుని, తిరుపతిలోని రాస్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం 'కిసాన్ సమ్మాన్ దివస్ -2025' వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి రాస్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జిల్లాలోని ఆదర్శ రైతులను సత్కరించారు. పిచ్చాటూరు మండలానికి చెందిన ఆదర్శ పౌల్ట్రీ రైతు టిపి రంగారెడ్డి పౌల్ట్రీ సాగులో విశేష ప్రతిభ కనబరిచినందుకు ఈ ఘన సన్మానానికి ఎంపికయ్యారు. ఆయన కృషి విజ్ఞాన కేంద్రం అందించిన సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రవేత్తల సూచనలతో, సంవత్స రానికి వెయ్యి పక్షులతో మూడు బ్యాచ్‌లుగా పౌల్ట్రీ సాగు చేస్తూ విజయవంతంగా నిర్వహిస్తున్నారు. దీన్ని గుర్తించి రాస్ సంస్థాధిపతి శ్రీ వెంకటరత్నం చేతుల మీదుగా, ఆదర్శ పౌల్ట్రీ రైతును శాలువాతో ఘనంగా సత్కరించి, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాస్ సంస్థ అధికారులు, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, వివిధ మండలాల నుంచి రైతులు పాల్గొన్నారు.

## గూడూరు బంద్ విజయవంతం

**ప్రజాశక్తి - గూడూరు టౌన్ :** గూడూరును జిల్లా కేంద్రం చేయాలని లేని పక్షంలో నెల్లూరు జిల్లాలో కలపాలని కోరుతూ గూడూరు పట్టణంలో జేఏసీ ఆధ్వర్యంలో గత చేపట్టిన రిలే దీక్షలు 16 రోజులుగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ బంద్ విజయవంతమైంది. గూడూరును జిల్లా కేంద్రం చేయాలని లేని పక్షంలో నెల్లూరు జిల్లాలో కలపాలని కోరుతూ జెఏసి ఆధ్వర్యంలో నిర్వహించారు. పలువురు వ్యాపారస్తులు స్వచ్ఛందంగా దుకాణాలను మూసి సంఘీభావం తెలిపారు. విద్యార్థి జేఏసీ సభ్యులు పలు ప్రభుత్వ పాఠశాలలో కార్యాలయాలను మూయించారు. విద్యార్థి జేఏసీ సభ్యులు పలు ప్రభుత్వ పాఠశాలలో కార్యాలయాలను మూయించారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద రోడ్డుపై బైఠాయించారు. కొంతసేపు బస్సులు నిలిచిపోయాయి. గూడూరును జిల్లా కేంద్రం చేయాలని నినాదాలతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పలు ప్రాంతాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. బంద్ కు మద్దతుగా జ్యువెలరీ అసోసియేషన్ సభ్యులు, బార్ అసోసియేషన్ సభ్యులు మద్దతు తెలిపారు.

## టీవీఎస్ ట్రస్ట్ ఇళ్ల తనిఖీ

**ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్:** వెంకటగిరి రూరల్ మండలంలోని గుండ్లసముద్రంలోని ఎస్టీ కాలనీలో టీవీఎస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న గృహాలను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మంగళవారం పరిశీలించారు. పటిష్ట ఇళ్ల నిర్మాణమే లక్ష్యంగా చేపట్టిన ఈ ప్రాజెక్టులో నిర్మాణ నాణ్యత, పనుల వేగం, లబ్ధిదారుల ఎంపిక వంటి అంశాలపై ఎమ్మెల్యే ఆరా తీశారు. ఇళ్ల నిర్మాణంలో ఉపయోగిస్తున్న మెటీరియల్ నాణ్యతను, గోడలు పైకప్పుల బలాన్ని ప్రత్యక్షంగా పరిశీలించిన ఎమ్మెల్యే, ఎక్కడా రాజీ పడకుండా ప్రమాణాలు పాటించాలని ట్రస్ట్ ప్రతినిధులు, కాంట్రాక్టర్లకు సూచించారు. లబ్ధిదారులకు నీటి సరఫరా, డ్రైనేజీ, విద్యుత్, అంతర్గత రహదారులు వంటి మౌలిక సదుపాయాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. టీవీఎస్ ట్రస్ట్ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రాజెక్టును నిర్ణీత కాలంలో పూర్తిచేసి నాణ్యతగా నిర్మించి రైతులకు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, టీవీఎస్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## త్రో బాల్‌లో రాష్ట్ర స్థాయికి ఎంఈవో హేమమాలిని

త్రోబాల్ రాష్ట్ర పోటీకి ఎంపికైన ఎంఈవో

**ప్రజాశక్తి- పిచ్చాటూరు:** జిల్లా స్థాయి మహిళా ఉపాధ్యాయుల త్రోబాల్ పోటీలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా ల రాగిగుంట, కేవిబి పురం మండ లంలో నాలుగు డివిజన్‌లు తిరుపతి, శ్రీకాళహస్తి , గూడూరు, సూళ్లూరుపేట జిల్లా స్థాయి సెలక్షన్స్ నిర్వహించారు. ఇందులో శ్రీకాళహస్తి డివిజన్ లోని పిచ్చాటూరు మండలం విజేతగా నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. కెప్టెన్ హేమమాలిని కోచ్ పిచ్చాటూర్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు గిరి ప్రకాష్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ఈ సందర్భంగా కేవీబీపురం ఎంఈఓ లక్ష్మీపతి, ప్రధానోపాధ్యాయులు, వెంకట కృష్ణయ్య , పిచ్చాటూరు మండల ఉపాధ్యాయులు ఆమెకు అభినందనలు తెలిపారు.

## నియామక పత్రాలు అందజేత

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** పుత్తూరు ఐసిడిఎస్ డివిజన్ ఉన్న రూరల్ మండలం రామసముద్రం, మున్సిపాలిటీ పరిధిలోని , కట్ట కింద రామకృష్ణాపురం, ఆర్టీసీ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రంలో నూతనంగా హెల్పర్ల పోస్టుకు ఎంపికైన వారికి నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ మంజూరు పత్రాలు మంగళవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు మంచి పౌష్టిక ఆహారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటరీ జిల్లా అధ్యక్షులు షణ్ముగం రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ అంకయ్య, ఇన్‌ఛార్జి సిడిపిఓ సంధ్య, టిడిపి జిల్లా నాయకులు ధనుంజయ నాయుడు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## బడిబయటి పిల్లలకు అవగాహన

**ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ:** బడికి వస్తూ మధ్యలో బడికి నిలిచిపోయిన విద్యార్థుల తల్లిదండ్రులకు వేణుగోపాలపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విద్యాశాఖ అధికారి రవీంద్రనాథ్ కలిసి మంగళవారం అవగాహన కల్పించారు. గిరిజన కాలనీని సందర్శించి పిల్లలకు రవాణా సౌకర్యం కల్పిస్తూ తల్లులు బ్యాంకు ఖాతాలో జమ చేస్తున్నారని తెలిపారు. పిల్లలను నిలపకుండా బడికి పంపాలన్నారు. ఆటో సాయంతో పిల్లలు పాఠశాలకు రావడంతో ఆటోవాలాలకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రుల అకౌంట్లో డబ్బులు జమ చేశారు. ఈ కార్యక్రమంలో పిల్లల తల్లిదండ్రులు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాని

**ప్రజాశక్తి -రామచంద్రపురం (తిరుపతి రూరల్):** ముఖ్యమంత్రి సహాయనిధి బాధితులకు ఓ వరం లాంటిదని ఎమ్మెల్యే పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని) అన్నారు. మంగళవారం చంద్రగిరి నియోజక వర్గ టిడిపి కార్యాలయంలో తిరుపతి రూరల్, రామచంద్రాపురం, చంద్రగిరి, పాకాల, యర్రావారి పాలెం మండలాలకు చెందిన పలువురికి రూ.23 లక్షల 74 వేల రూపాయలను ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రభుత్వం మంజూరు చేసిన చెక్కులను ఎమ్మెల్యే పులివర్తి నాని పంపిణీ చేశారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంజూరు చేయించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి లోకేష్‌కు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి మాజీ అధ్యక్షుడు ఆరి లీల మోహన్ నాయుడు, తానికొండ రెడ్డప్ప నాయుడు, శ్రావణ్, తానికొండ గోపి చౌదరి, నూతన పాటి వరప్రసాద్ పాల్గొన్నారు.

## సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** రూరల్ మండలం తిరుమలకుప్పంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన క్రైస్తవ సోదర, సోదరీమణులకు హృదయ పూర్వక క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమ, శాంతి, సేవ వంటి మహోన్నత విలువలు ప్రతి ఒక్కరి జీవితంలో నిలిచిపోవాలని ఆకాంక్షించారు. సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వం మరింత బలపడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులకు, కార్యక్రమానికి హాజరైన గ్రామ ప్రజలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కూటమి నాయకులు, పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం పాస్టర్లు క్రైస్తవ సోదరులు మహిళలు, పాల్గొన్నారు.

**ఏర్పేడు :** కోబాక మిట్టలో ది గార్మెంట్ ఇండియా చర్చిలో సెమీ క్రిస్మస్ సంబరాలు పాస్టర్ పుణ్యరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కోబాక ఎంపీటీసీ గౌరమ్మ పాల్గొన్నారు. అందరికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఇలాంటి వేడుకలు చేయడం చాలా సంతోషంగా ఉందని ప్రతి సంవత్సరం వేడుకలు కొనసాగాలని గౌరమ్మ తెలిపారు. సెమీ క్రిస్మస్ సందర్భంగా 250 మందికి దుప్పట్లు, చీరలు పంపిణి చేయడం జరిగింది.ఈ వేడుకలో చుట్టు పక్కల గ్రామాలనుండి విశ్వాసులు, గ్రామ ప్రజలు అందరూ పాల్గొన్నారు.

## షణ్ముగ రెడ్డికి ఘన సన్మానం

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** చిత్తూరు జిల్లా పార్లమెంటరీ అధ్యక్షులుగా నియమితులై న సి షణ్ముగ రెడ్డిని పుత్తూరు పట్టణానికి చెందిన చిత్తూరు పార్లమెంటరీ ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం చెంచయ్య, నగరి నియోజకవర్గ ఎస్టీ సెల్ నాయకులు దశరథ రామయ్య మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పూల మాలతో, శాలువాతో సన్మానించారు. ఆయన మరెన్నో పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. పార్టీ అభివృద్ధి కోసం అందరూ కలిసి కట్టుగా పని చేద్దామని తెలిపారు.

## ఎస్‌విఆర్‌లో రైతు దినోత్సవ వేడుకలు

**ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ:** మండలంలోని ఎస్‌విఆర్ పూజిత పాఠశాలలో మంగళవారం ఉదయం రైతు దినోత్సవ వేడుకలు యోగ గురువు సురేష్ నాయుడు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు సురేష్ నాయు డు మాట్లాడుతూ గో ఆధారిత వ్యవసాయంతో పండించిన పంట లు మాత్రమే పిల్లలకు ఆరోగ్యాన్నిస్తాయని, ఆయుష్షుని, మేధాశక్తిని పెంచుతాయని వివరించారు. వ్యవసాయ మెలకువలను రైతులు తమ ఇంటి వరక్రైనా ప్రారంభించాలని యోగా గురువు సూచించారు. పిల్లలను రైతు, రైతు కూలీలు, మహిళా రైతుల వేషాలు వేయించి వీధుల్లో వివిధ నినాదాలతో విద్యార్థిని విద్యార్థులు, టీచర్లు, తల్లిదండ్రులు ర్యాలీ నిర్వహించారు. సమీపంలోని సుభాష్ పాలేకర్ కృషి విధానాలు కలిగిన వ్యవసాయ క్షేత్రానికి పిల్లలను తీసుకువెళ్లి పూలు, కూరగాయలు, ఆకు కూరల మొక్కలను ప్రత్యక్షంగా చూపించారు. కలుపు తీయడం, పూలు కోయడం, వరి విత్తనాలు చల్లడం, వేరుశనగ విత్తనాలు నాటడం వంటి కృత్యాలు చేయించారు. పిల్లలకు పొలంలోనే ప్రసాదాలు అందించారు. చదువుతోపాటు సంతోషా న్నిచ్చే ఇలాంటి ఫీల్డ్ ట్రిప్పులు పిల్లలకు మానసిక ఉల్లాసాన్ని స్తాయని తల్లిదండ్రులు అభిప్రాయపడ్డారు.

## భూ పరిహారం ఇచ్చి ఆదుకోవాలి

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** 2008లో గాలేరు -నగరి సుజల స్రవంతి కాలువ నిర్మాణం కోసం తమ ఉమ్మడి కుటుంబ సభ్యుల నుండి సేకరించిన ఎ5.55 సెంట్ల భూమికి ఎ2.05 సెంట్ల భూమికి భూ పరిహారం చెల్లించారని, మిగిలిన భూమికి కూడా అధికారులు పరిహారాన్ని ఇచ్చి ఆదుకోవాలని పుత్తూరు మండలం తణుకు గ్రామానికి చెందిన రైతు టి. ఆనందయ్య అధికారులకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో కుటుంబ సభ్యులతో కలిసి ఆనందయ్య మాట్లాడుతూ గడిచిన 20 ఏళ్లుగా ఈ భూ పరిహారం కోసం అధికారుల చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నామని, ఆర్థిక స్తోమత లేక పరిహారం కోసం కోర్టులను ఆశ్రయించ లేదన్నారు. తమ భూమికి సంబంధించి పట్టా పాసు పుస్తకా లు ఉన్నాయని, కానీ అధికారు లు పరిహా రం ఇచ్చిన ఎ2.05 సెంట్లు భూమి మినహా భూమి ప్రభుత్వ పోరంబోకుగా అడంగల్ కాపీలలో ఉందని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై జిఎన్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కు అర్జీలు ఇచ్చానని, భూ రికార్డు లలో తప్పిదాలు ఉన్నాయని కలెక్టర్ కు సిఫార్సు చేశారన్నారు.వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరాడు.

# క్రైం న్యూస్

## రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్మికుడు మృతి

**ప్రజాశక్తి -రేణిగుంట:** రేణిగుంట పట్టణంలో రమణ విలాస్ సర్కిల్ వద్ద మంగళవారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్మికుడు ట్రాక్టర్ డ్రైవర్ చిన్నయ్య (55)మృతి చెందాడు. చిన్నయ్య విధుల్లో భాగంగా చెత్త సేకరణకు వెళ్లి ట్రాక్టరును ఆపి ఉండగా బ్రేక్ ఫెయిల్ లారీ వెనుక నుంచి ఢీకొడంతో చిన్నయ్య కింద పడి ప్రాణాలు కోల్పోయాడు. మరో కార్మికుడు సుధాకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని వెంటనే చికిత్స నిమిత్తం తిరుపతిలోని మారుతి హాస్పిటల్ తరలించారు. రేణిగుంట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## గుర్తుతెలియని మృతదేహం కలకలం

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:** వీధులను శుభ్రపరుస్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు కుళ్ళిన గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన ఘటన మంగళవారం శ్రీకాళహస్తి పట్టణంలో కలకలం రేపింది. పట్టణంలోని బంగారమ్మ గుడి సమీపంలోని బస్ షెల్టర్ చుట్టుపక్కల పారిశుధ్య పనులు చేస్తున్న మున్సిపల్ కార్మికులకు గోనె సంచిలో కట్టిపడేసిన బాగా కుళ్ళిన మృతదేహం కంట పడింది. వారు టూ టౌన్ పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. అయితే మృతదేహం బాగా కుళ్లిపోయి ఉండడంతో ఆడ, మగ అన్న నిర్ధారణకు పోలీసులు రాలేకపోయారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే స్థానికులు చెప్తున్న కథనం ప్రకారం.. లభ్యమైన మృతదేహం ఓ యాచకురాలుదనీ, ఆమె ఆ బస్సు షెల్టర్‌లో మరో వృద్ధ యాచకుడుతో కలిసి ఆశ్రయం పొందేదని చెప్తున్నారు. పది రోజుల క్రితం యాచకుడు అనారోగ్యంతో మృతి చెందగా మున్సిపల్ సిబ్బంది దహన క్రియలు నిర్వహించారనీ, అప్పటినుంచి యాచాకురాలు కూడా అక్కడ కనిపించడం లేదని అంటున్నారు. తాజాగా అదే ప్రాంతంలో మరో మృతదేహం లభ్యం కావడంతో బహుశా యాచకురాలిదే అయ్యి ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. కేసు దర్యాప్తు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ నాగార్జున రెడ్డి తెలిపారు.

## మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలు

**ప్రజాశక్తి- వరదయ్యపాలెం:** మద్యం తాగి లారీ నడిపిన వ్యక్తికి రెండు రోజులు జైలు శిక్ష ,12 వేల రూపాయల జరిమానా సత్యవేడు న్యాయస్థానం విధించింది. శనివారం సాయంత్రం వాహన తనిఖీ నిర్వహిస్తున్న వరదయ్యపాళెం పోలీసులకు మద్యం మత్తులో లారీ నడుపుతూ పట్టుబడిన సెల్వరాజ్‌ను సత్యవేడు న్యాయస్థానం లో హాజరు పరచగా జడ్జి రెండు రోజుల జైలు శిక్ష, 12 వేల రూపాయల జరిమానా విధించారని స్థానిక ఎస్ఐ మల్లికార్జున్ తెలిపారు.

## న్యాయం చేయండి..

### ఎస్ఐకి బాధితురాలు వినతి

పోలీసులకు సమస్యను వివరిస్తున్న దృశ్యం

**ప్రజాశక్తి -చిట్టమూరు :** తన భర్త చనిపోవడంతో తానే ముగ్గురు కుమార్తెలకు వివాహాలు చేసి ఏకాకిగా జీవనం గడుపుతున్నానని, తన భర్త ద్వారా అందాల్సిన పొలాన్ని వారి సోదరుల అన్నదమ్ములు బలవంతంగా లాక్కున్నారని న్యాయం చేసి ఆదుకోవాలని పై స్థాయి పోలీసులను, అధికారులను బాధితురాలు అభ్యర్థిస్తోంది. బాధితురాలి కథనం మేరకు.. మండలంలోని కొక్కుపాలెంకు చెందిన మల్లాపు రాధమ్మ భర్త చనిపోయి చాలా కాలం అయ్యిందని, తన భర్తకు చెందాల్సిన పొలాన్ని అతని సోదరుడి కుమారుడు మల్లాపు సుమన్ వారి అన్నదమ్ములతో కలిసి బలవంతంగా లాక్కున్నారని వాపోయింది. దౌర్జన్యం చేస్తున్నారని ఎస్ఐకి ఈ నెల 8వ తేదీ మొర పెట్టుకుంది. స్పందించిన ఎస్ఐ చిన బలరామయ్య మంగళవారం ఆమె పొలం వద్దకు వెళ్లారు. ఈ సందర్భంగా రాధమ్మ మాట్లాడుతూ తన భర్త చనిపోయాడని, తన ముగ్గురు ఆడపిల్లలను పెంచి పోషించి వారికి వివాహం చేసి ఏకాకిగా ఉంటున్నానని, తను ఒంటరి అయి నందున తన భర్త సోదరుడి కుమారుడు మల్లాపు సుమన్ వారి కుటుంబీకులతో కలిసి ఊరినుండి వెళ్లగొట్టాలని అరాచకం సృష్టిస్తున్నారని తనకు న్యాయం చేయాలని వేడుకుంది. అయితే మల్లాపు సుమన్‌ని పిలిపించి విచారించకుండా పోలీసులు వెళ్లిపోయారని వాపోయింది. పై స్థాయి అధికారులైనా స్పందించి తన సమస్యను పరిష్కరించాలని బాధితురాలు వేడుకుంది.

## వందరోజుల ప్రణాళిక పర్యవేక్షణ

**ప్రజాశక్తి-ఏర్పేడు:** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బండారుపల్లిలో పదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన వంద రోజుల ప్రణాళికను ఎంఈఓ2 దయాకర్ రావు పర్యవేక్షించారు. విద్యార్థులు బాగా చదివి పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు దిశ నిర్దేశం చేసి పలు సలహాలు సూచనలు ఎంఈఓ ఇచ్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి రాజవేలు, ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, చిట్టి బాబు పాల్గొన్నారు.

## భారీ వాహనదారులు

## లోడింగ్ పరిమితిని పాటించాలి : సిపిఎం

**ప్రజాశక్తి - సత్యవేడు** : భారీ వాహనాలతో పరిమితికి మించి లోడింగ్‌తో వెళ్లడం వల్ల రోడ్లు ధ్వంసం అవుతున్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి జనార్ధన్, సత్యవేడు ప్రాంతీయ కార్యదర్శి మెలుగు రమేష్ విమర్శించారు. సత్యవేడు లోని సిపిఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ముఖ్యంగా సత్యవేడు కన్నవరం రహదారి, జడేరి అల్లప్ప గుంట, పీవీపురం రాజగోపాలపురం మీదుగా చిన్నపాండూరు వెళ్లే రహదారులు గ్రావెల్ క్వారీల లారీలు, కేవీబి పురం మండలం పెరిందేశం నుండి పిచ్చాటూరు వరకు ఉన్న రహదారులు క్వారీ యజమానుల లారీలు, టిప్పర్లు వాటి పరిమితి కంటే అదనంగా లోడింగ్ చేసుకొని రావడం వల్ల రోడ్లు ధ్వంసం అవుతున్నాయన్నారు. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు, వాహన చోధకులు తీవ్ర ఇబ్బందులు ఫడడమే కాక యాక్సిడెంట్లు జరిగి ఆసుపత్రుల పాలవుతున్న ఘటనలు ఉన్నాయన్నారు. తక్షణమే ప్రభుత్వ అధికారులు జోక్యం చేసుకొని అధిక లోడుతో వెళుతున్న లారీలను నియంత్రించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు భాస్కర్, మునస్వామి, కష్ణయ్య పాల్గొన్నారు.

గౌరవ గూడూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No. 295/1999
ఉగ్గుమూడి చంద్రారెడ్డి ...వాది
VS
ఉగ్గుమూడి జయరామిరెడ్డి మరియు ఇతరులు
...ప్రతివాదులు
D6:కొల్లు మానసాదేవి భర్త సుదాకర్ రెడ్డి, డోర్ నెం.202, ఎ-బ్లాక్, రామరంగ కాలనీ, ప్రొన్నిమేరు, చెన్నై.
వాది పై దావా మీపైన దాఖలు చేసియున్నందున మీకు నోటీసుకు గాను తేది.8-1-2026 న వాయిదా వున్నందున మీరు ఉదయం 10.00 గం॥లకు పై కోర్టులో హాజరై ఆక్షేపణలున్న తెలుపవలసనది లేని యెడల దావా మీ పరోక్షములో తీర్మానం చేయబడునని తెలియ జేయడమైనది.
వాయిదా తేది: 8-1-2026
ఇట్లు
పి.భాస్కర్ రావు, బి.యస్‌సి,బి.ఎల్.,
అడ్వకేట్, గూడూరు
సెల్-9440457111

## సాయి కళా ఫౌండేషన్ ఇతరులకు స్ఫూర్తిదాయకం

**ప్రజాశక్తి -తిరుపతి సిటీ:** నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ శ్రీ సాయి కళా ఫౌండేషన్ తిరుపతి ఇతరులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందని వశిష్ఠ, చైతన్య పాఠశాలలు కరస్పాండెంట్ డాక్టర్ కొండూరు రెడ్డయ్య రాజు తెలిపారు. సాయి కళ తొమ్మిదో వర్థంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సాయి కళా డాక్టర్ మధుసూదన్, సరిత దంపతుల ఏకైక కుమార్తె. 2016లో యూనివర్శిటీ మెడిసిన్ లో టాపర్ అని, ఎంబీబీఎస్ వైదేహి కాలేజ్ బెంగళూరులో చదువుతూ హార్ట్ సమస్యతో హాస్పిటల్లో చేర్పించారని, డాక్టర్లు శతదా శ్రమించినా పరిస్థితి విషమించి మరణించింది అని గుర్తు చేశారు. ఒకగాను ఒక కుమార్తె చనిపోవడంతో చొక్కా సాగులను మునిగిన దంపతులు, తమ కుమార్తె జ్ఞాపకార్థం తిరుపతిలో సాయి కళా ఫౌండేషన్ స్థాపించి, ఎన్నో మెడికల్ క్యాంపులు, సేవా కార్యక్రమాలు నిర్వహించి గొప్ప విద్యావేత్తగా సంఘ సేవకులుగా అనేక అవార్డులను అందుకున్నారని తెలిపారు. 2017 జూలై 9న శ్రీసాయికళా ఫౌండేషన్ స్థాపించి అనేక ఉచిత వైద్య శిబిరాలను, అన్నదాన కార్యక్రమాలను, అవగాహన సదస్సులను నిర్వహించారు. శ్రీ సాయి కళా ఫౌండేషన్ ద్వారా చేసిన సేవలకు గుర్తింపుగా 14 జాతీయ అవార్డులు, మూడు అంతర్జాతీయ అవార్డులతో పాటు వరల్డ్ రికార్డ్ ను సొంతం చేసుకున్నారని గుర్తు చేశారు. భవిష్యత్తులో మరిన్ని

### కొండూరు రెడ్డెయ్య రాజు


సేవా కార్యక్రమాలు నిర్వహించనున్న ఆ దంపతులను ఆయన ఈ సందర్భంగా అభినందించారు. అనంతరం సాయి కళాకు ఘనంగా నివాళి అర్పించారు.

## సమగ్ర దర్యాప్తు చేయాలి

### గోవిందరాజస్వామి ఆలయ బంగారు తాపడంపై కిరణ్ రాయల్ డిమాండు

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** టీటీడీ అనుబంధ ఆలయమైన శ్రీ గోవిందరాజస్వామి ఆలయంలో 2023లో 100 కేజీల బంగారంతో విమాన గోపురానికి తాపడం చేయించాలని నిర్ణయించడం, అందులో కుట్రపూరితంగా 32 విగ్రహాలను తొలగించడం చేశారని, బంగారు తాపడం విషయంలో పలు అనుమానాలు ఉన్నాయని దీనిపై సమగ్ర దర్యాప్తు జరగాలని జనసేన తిరుపతి నియోజకవర్గం బాధ్యులు కిరణ్ రాయల్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023వ సంవత్సరంలో గోవిందరాజ స్వామి ఆలయంలో స్వామి వారి గర్భగుడి పైభాగాన ఉన్న గోపురానికి 100 కేజీల బంగారుతో తాపడం చేయించాలని నిర్ణయించడంతో, తమిళనాడుకు సంబంధించిన హిందూ ఏతరులతో తాపడం పనులు జరిగాయని, అయితే పనులలో 32 చరిత్ర కలిగిన విగ్రహాలను తొలగించాలని, బంగారు తాపడం కూడా 9 లేయర్లతో చేశారా లేక, బంగారాన్ని తక్కువ వినియోగించి మిగిలిన బంగారాన్ని దారి మళ్ళించారా అని అనుమానాలు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో సమగ్ర దర్యాప్తు జరిపితే అప్పుడు విధుల్లో ఉండి బంగారు దారి తప్పడానికి కారకులెవరో ప్రజలకు తెలుస్తుందన్నారు. దీనిపై టిటిడి చైర్మన్, ఈవో, సివి అండ్ ఎస్ ఓ, రాష్ట్ర ప్రభుత్వానికి లేఖలు రాస్తామని స్పష్టం చేశారు.